ప్రజా ఉద్యమాలతో జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటు

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్

సీపీఎం ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సాగర్

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 15 : జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాఉద్యమాలను నిర్మించి తోడ్పాటును అందిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఎం జిల్లా3వ మహాసభ రెండోరోజు ప్రతినిధుల సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో నల్లమల అడవులు ఉన్నా వెదురుబొంగు, కాగితపు ఆధారిత పరిశ్రమలు నెల కొల్పడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నిరుద్యోగ, గిరిజన, దళితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూపాలని డిమాండ్ చేశారు. పేదోడికి తిండిలేక జీవనం కొన సాగిస్తుంటే పెట్టుబడిదారులు రోజురోజుకు సంపన్నులుగా మారుతున్నారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మనుధర్మాశాస్త్రాన్ని, ఆర్ ఎస్ ఎస్ ఎజెండాలను అమలు చేసే ప్రయత్నం జరుగుతుందని వామపక్ష, ప్రజాస్వామిక వాదులుగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరుగ్యారెంటీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దాంతో పాటు ఏడో గ్యారెంటీ కూడా ప్రకటించాలని అదే ప్రశ్నించే స్వేచ్ఛ కాని అడుగడుగున వామపక్షాల ప్రతిపక్షాల గొంతులను నొక్కుతున్నారని ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనలో అర్ధరాత్రి అక్రమ అరెస్టులకు పాల్పడుతూ ఇచ్చిన మాటను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో ప్రజాసమస్యలపై పోరాడుతామని ఈ మహాసభలో అటువంటి తీర్మానాలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. మూడో సారి అధికారంలోకి వస్తే రెండుకోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్రనాయకులు భూపాల్, వెంకట్రాములు, ధర్మానాయక్, జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు దేశ్యానాయక్, శ్రీనివాస్, కందికొండగీత, ఆంజనేయులు మాట్లాడారు. జిల్లానాయకులు మల్లేశ్, శంకర్‌నాయక్, నిర్మల, శ్రీనివాసులు, నర్సింహా, ఈశ్వర్, ఆశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లాకార్యదర్శిగా పర్వతాలు ఎన్నిక

మండలంలోని బొమ్మనపల్లికి చెందిన వర్ధం పర్వతాలు జిల్లా సీపీఎం కార్యదర్శిగా ఆదివాలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 14,15 తేదీల్లో పట్టణంలోని మహాసభలో పర్వతాలును మూడో సారి నియమించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఈ మలుపును పట్టించుకోరా...?

తిప్పారెడ్డిపల్లి సమీపంలో ప్రమాదంగా కరంగా ఉన్న మలుపు

వంగూరు, డిసెంబర్ 15 : మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని తిప్పారెడ్డిపల్లి–డిండి రోడ్డుపై తిప్పారెడ్డిపల్లి సమీపంలో వున్న మలుపు ప్రమాదకరంగా వున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనదారులు ప్రయాణించాలంటే తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మలుపులవద్ద ఎదురుగా వచ్చే వాహనం కనబడక వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి. ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోతే పెనుప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. ఈ రోడ్డుపై నిత్యం పలుగ్రామాల ప్రజలు డిండికి వెళ్లి వస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ మలుపు వద్ద చెట్లను తొలగించి వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతలమయంగా జాతీయ రహదారి

- ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం వీడని అధికారులు

గుంతలమయంగా మర్రిపల్లి వద్ద జాతీయ రహదారి

చారకొండ, డిసెంబర్ 15 : మండలంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి మర్రిపల్లి వద్ద పూర్తిగా గుంతలమయంగా ఏర్పడింది. రహదారిపైన లోతైన గుంతలో ఉండడంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులకు, ఇతర వాహనదారులు గుంతల్లో పడి తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. లోతైన గుంతలు ఏర్పడి భారీ వాహనాలు రాక పోకలు రద్దుగా ఉండటంతో రోడ్డు పక్కన ఉన్న ఇండ్లలో దుమ్ము చేరి రోగాల బారీన పడుతున్నారు. సంబంధిత అధికారులకు, జాతీయ రహదారి కాంట్రాక్టర్లకు ఎన్ని సార్లు చెప్పిన ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతాయని ప్రజలు హెచ్చరించారు.

బోనఫైడ్‌ల రికార్డుల ట్యాంపరింగ్ కేసులో.. ముగ్గురికి రిమాండ్

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.167 of 2024
Between :
SHIRIRAM CHITS (P) LTD.
BR. Mahabubnagar ... **Disputant**
And
B.Annapurna and others ... **Opponents**
To **NOTICE**
2. O.Praveen Kumar S/o O.Krishnaiah, Aged:47 years, Occ: Assistant Manager, Employee ID 00642960, O/o State Bank of India, Nagarkurnool town and Dist., R/o H.No. 2-23, Housing board colony, Nagarkurnool town and Dist., ...**Opponents 1 to 4**
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabub nagar on **28-12-2024** at **11-30A.M.** for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 15 : తమకు అనుకూలంగా బోనఫైడ్‌లను మార్పుకోసం రికార్డులను తారుమారు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో బోనఫైడ్ కోసం పాఠశాల రికార్డులను తారుమారు చేసిన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న అటెండర్ ఎల్లయ్యపై హెచ్ఎం లింగస్వామి స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసున మోదు చేశారు. దీంతో దర్యాప్తులో ఎల్లయ్య సహాయంతో నల్గొండ జిల్లా చందంపేట మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన రవీందర్, పదర మండలం చిట్లంకుంటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనిల్ అనే ముగ్గురు కలిసి పాఠశాల రికార్డులను తారుమారు చేసి తమకు అనుకూలంగా రికార్డులలో మార్చుకోని హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాలో స్థానికులుగా పలు ఉద్యోగాలు సంపాదించినట్లు తమ దర్యాప్తులో తెలిందన్నారు. కేసున మోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో శని వారం హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వణికిస్తున్న చలి

- రికార్డు స్థాయిలో తోటపల్లిలో 12.5 కనిష్ఠ ఉష్ణోగ్రత
- వారం రోజులుగా వాతావరణంలో మార్పులు
- జిల్లాలో 17 గ్రామాల్లో 12.5 నుంచి 15 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రత
- వణికిపోతున్న గ్రామీణ, పట్టణ ప్రజలు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 15: నాగర్‌కర్నూల్ జిల్లాలో చలి తీవ్రరూపం దాల్చి వణుకు పుట్టింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలో మార్పుచోటు చేసుకుంటూ కనిష్ఠస్థాయికి పడిపోతున్నది రాత్రి, పగలు తేడా లేకుండా చల్లటి గాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ చలితీవ్రత పెరిగింది. గత 24గంటల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే కల్వకుర్తి మండలం తోటపల్లిలో కనిష్ట ఉష్ణోగ్రత 12.5, తెలకపల్లిలో 13.7గా నమోదైంది. జిల్లాలోని 15 మండలాల్లోని 17గ్రామాల్లో 12.5 నుంచి 15.0 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వాతావరణ శాఖాధికారులు ఎల్లోఅలెర్ట్ ప్రకటించారు. మిగతా మండలాల్లో 15.1 నుంచి 17.3 డిగ్రీలుగా నమోదైంది. దీంతో రెండు రోజులుగా మరింత కనిష్ఠస్థాయికి చేరుకొని చలి విజృంభిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలిగాలల ఉధృతి పెరగడంతో పట్టణాల తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల తోపాటు శ్వాస కోశ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో చలి ప్రభావం పట్టణాలే కాకుండా గ్రామీణ ప్రాంతాలోనూ ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రధాన రహదారులు పొగమంచుతో కమ్ముకుపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వస్తున్న వాహనదారులు లైట్లు వేసుకొని వస్తేగానీ వాహనం వస్తున్నట్లుగా గుర్తించలేకపోతున్నారు. సాయంత్రం 4 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు చలి గాలులు వీస్తున్నాయి. దీంతో రోజురోజుకు రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు పడిపతున్నాయి. చలికాలం ప్రారంభంలోనే ఎప్పుడూ లేనంతగా ఈ సారి జిల్లాలో 12.5గా కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడంతో జిల్లా ప్రజలకు చలి భయం పుట్టుకొస్తుంది. సాయంత్రం పొద్దుమూకేరికి వ్యాపారులు సైతం తమ కొట్లను కట్టేసి ఇంటిబాటపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులకు వెళ్లే రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పంట కాపలాకు వెళ్లాలంటేనే చలికి వణికిపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతుందన్న వాతావరణ శాఖాధికారుల హెచ్చరికలతో ప్రజల్ని మరింత వణుకు పుట్టిస్తోంది. ప్రస్తుతం 12.5నుంచి 15.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవుతుండగా, ముమ్ముందు 10డిగ్రీ సెల్సియస్‌కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని వెల్లడించడం తో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మూడురోజులుగా కందనూలు జిల్లా చలికివణికిపోతుండగా ముమ్ముందు మరింత చలితీవ్రత పెరిగే అవకాశం ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. చలి తీవ్రతకు జాగ్రత్తలు తీసుకుంటే తప్పా మన శరీరాన్ని కాపాడుకోలేమని వైద్యులు పేర్కొంటున్నారు.

ట్యాంక్‌బండ్‌పై పొగమంచుతో కప్పుకున్న రోడ్డు..

నాగర్‌కర్నూల్‌లో ట్యాంక్‌బండ్‌పై పొగమంచులో చిన్నారులు


నాగర్‌కర్నూల్‌లో అంబేద్కర్‌చౌరస్తాలో

ట్యాంక్‌బండ్‌పై పొగమంచులో చిన్నారులు

ఇప్పటికే చలిగాలుల కారణంగా రక్షణకోసం స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్ల, గ్లజులు విని యోగం పెరిగింది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే వారికి స్వెట్టర్లు, గ్లజులు, హెల్మెట్‌తో పాటు మంకీ క్యాప్‌లు తప్పనిసరి కావడంతో కొనుగోలుకు వెనుకాడడం లేదు. వాడకం పెరగడంతో ధరలు సైతం అదేరీతిలో పెరిగిపోతున్నాయి. అయినా ప్రజలు కొనుగోలు చేసి చలి నుంచి రక్షణ పొందుతున్నారు. ఏదేమైనా చలిని తట్టుకునేందుకు తగుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

గత 24 గంటల వ్యవధిలో కనిష్ట ఉష్ణోగ్రత వివరాలు

మండలం	గ్రామలొకేషన్ (ఎల్లోఅలెర్ట్)	కనిష్ట ఉష్ణోగ్రత
కల్వకుర్తి	తొటపల్లి	12.5
తెలకపల్లి	తెలకపల్లి	13.7
కల్వకుర్తి	ఎల్లికల్	13.7
బిజినేపల్లి	బిజినేపల్లి	13.9
ఊర్కొండ	ఊర్కొండ	14.1
తిమ్మాజిపేట	తిమ్మాజిపేట	14.1
వెల్దండ	బొల్లంపల్లి	14.3
బల్మూర్	కొండా రెడ్డిపల్లి	14.3
తాడూరు	ఎంగంపల్లి	14.5
నాగర్‌కర్నూల్	కుమ్మెర	14.6
కల్వకుర్తి	కల్వకుర్తి	14.7
నాగర్‌కర్నూల్	పెద్దముద్దునూర్	14.7
వంగూరు	కిష్టంపల్లి	14.8
అమ్రాబాద్	అమ్రాబాద్	14.9
అమ్రాబాద్	వటువర్లపల్లి	14.9
అచ్చంపేట	అచ్చంపేట	14.9
ఉప్పునుంతల	ఉప్పునుంతల	15.0

మొదటిరోజు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు
- అనుమతించకపోవడంతో వెనుదిరిన వైనం

విశ్వవికాస్ డిగ్రీ కళాశాలవద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించకపోవడంతో వేచి చూస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 15: తెలంగాణ పబ్లిక్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్–2పరీక్ష మొదటిరోజు ఆదివాలం ప్రశాంతంగా జరిగింది. ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షను నిర్వహించినట్లు కలెక్టర్ సంతోష్ వెల్లడించారు. ఉదయం 10గంటల ప్రారంభమైన మొదటిపేపర్ పరీక్షకు పలు పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. దీంతో చేసేది లేక చాలా మంది అభ్యర్థులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. జిల్లాలోని 32పరీక్షా కేంద్రాలను అధికారులు సందర్శించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పరీక్షలను అధికారులు పర్యవేక్షణ చేశారు. 32 కేంద్రాల్లో మొత్తం 9,731 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి వుండగా, పేపర్ 1కు ఉదయం 4,772 మంది హాజరుకాగా 4,959 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 49శాతం హాజరుశాతం నమోదైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన రెండోపేపర్‌కు 4,755 మంది అభ్యర్థులు హాజరు కాగా 4,976 మంది గైర్హాజరయ్యారన్నారు.

బిజినేపల్లిలో

బిజినేపల్లి, డిసెంబర్ 15: మండలంలోని బిజినేపల్లి, పాలెం గ్రామాల్లో ఆదివాలం గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా సాగింది. మొదటిరోజు పాలెంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల తోపాటు జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు కేంద్రాలు, బిజినేపల్లిలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో మరో మూడు పరీక్షా కేంద్రాలు మొత్తం ఆరుపరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కాగా తాసీల్దార్ శ్రీరాములు, ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహించారు.

వెనుదిరిగి వెళ్తున్న మహిళా అభ్యర్థి

పాలెం కేంద్రం వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

మధుసూదన్‌రావు సేవలు మరువలేనివి

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 15 : మాజీ ఎమ్మెల్యే కటికనేని మధుసూదన్ రావు సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివాలం మధుసూదన్‌రావు నాలుగో వర్ధంతి ఆయన అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగు, సాగునీటి కోసం కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. రేమన్ గడ్డ వద్ద శంకుస్థాపన చేయించిన గొప్పవ్యక్తిని అభిమానులు స్మరించుకున్నారు. ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని గోపాల్‌దిన్నే రిజర్వాయర్‌ను మంజూరు చేయించాలన్నారు.కారక్రమంలో అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జీహెచ్ఎం మృతికి సంతాపం

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

అచ్చంపేట, డిసెంబర్ 15 : వనపర్తి జిల్లా రేకులపల్లితండాకు చెందిన జీహెచ్ఎం తారా బాయి మృతికి లింగాలకు చెందిన బంజారా నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లింగాలకు చెందిన దివంగత మాజీ జెడ్పీటీసీ రాంలాల్ కుమార్తె తారా బాయి వనపర్తి జిల్లాలో జీహెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే అనారోగ్యం కారణంగా తారాబాయి మృతిచెందడం బాధాకరమని గిరిజన నాయకులు బాలాజీ, మోతిరాం, శంకర్‌రాథోడ్, కిషన్, చందూనాయక్, భద్రు, బాలాజీ, సుందర్, శ్రీనివాస్ తదితరులు విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రేకులపల్లితండాలో చిత్రపటానికి నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

జంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చారకొండ, డిసెంబర్ 15 : మండలంలోని జూపల్లి మాజీసర్పంచ్ జంగయ్య యాదవ్ వర్ధంతి పురస్కరించుకొని ఆదివాలం ఆయన చిత్రపటానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్త ఫాముజ్జు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య యాదవ్ గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నేతలు వెంకటయ్యాదవ్, అక్కిశ్రీని వాస్‌గౌడ్, మల్లికార్జున్, సిరాజ్, జంగయ్య, దేవేందర్, గోపాల్, కార్తీక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కల్వకుర్తిలో కేట్ కట్ చేస్తున్న క్రైస్తవులు

కల్వకుర్తి, డిసెంబర్ 15 : పట్టణంలోని మోనో నైట్ బ్రదర్స్ అండ్ వర్కంటీన్ మెమోరియల్ ఎంబీ చర్చిలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. చర్చిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. పాస్టర్ రెవ రెడ్ బేబీరాజు, జ్యోతి ఫాస్టర్‌అమ్మ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో శోభ, కవిత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సగరులను భవననిర్మాణ కార్మికులుగా గుర్తించాలి

మాట్లాడుతున్న సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సాగర్

- రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సాగర్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబర్ 15 : ప్రభుత్వం సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని నెల్లికొండ కాంప్లెక్స్ భవనంలో ఆదివాలం సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రసంఘం అధ్యక్షుడు శేఖర్, జిల్లాసంఘం అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రూబిఫంక్షన్‌హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో సగరుల జనాభా అత్యధికంగాఉందని, అందుకుతగ్గట్టుగా రాబోయే ఎలక్షన్‌లో సగరులు పెద్దఎత్తున సర్పంచ్‌లుగా, వార్డుమెంబర్లుగా, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ రాజకీయ పార్టీ ఏ రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా కాదని, సగరులను గుర్తిస్తే వారికి అనుకూలంగా పోరాడుతామన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 166 జీవోను పునరుద్ధరించాలని సగరులను నిర్మాణ భవన కార్మికులుగా గుర్తించి బీసీ–డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన సంఘం నాయకులు, యువజన సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు, సగర బంధువులు పాల్గొన్నారు.

దళిత సాహిత్యాన్ని మలుపుతిప్పిన లక్ష్మీనర్సయ్య

నాగర్‌కర్నూల్ రూరల్, డిసెంబర్ 15 : దళిత సాంస్కృతిక సాహిత్యాన్ని అంబేద్కరిజం వైపు మలిపిన గుంటూరు లక్ష్మీనర్సయ్య గొప్ప మార్గదర్శి అని హైదరాబాద్‌బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్ అన్నారు. ఆదివాలం జిల్లా కేంద్రంలో సింగిల్‌విండో సమావేశాల్లో ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కార కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అతిథులందరూ అమ్మ మశమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కవి విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్యకు మశమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.20వేలనగదు, మెమొంటో ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సన్మానించారు. కవి యాకుబ్ మాట్లాడుతూ గుంటూరు లక్ష్మీనర్సయ్య తన జీవితమంతా దళిత బహుజన సాహిత్యానికి అంకితం చేశారన్నారు.విమర్శకుడిగా కవిత్వ నిర్మాణ పద్ధతులు సాహిత్య కళావిమర్శ, దళిత సాహిత్యం తాత్త్విక దృక్పథంతో తదితర పుస్తకాలు రాశారన్నారు. అనంతరం అవార్డు గ్రహీత గుంటూరు లక్ష్మీనరసయ్య, కోయ కోటేశ్వర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎదిరేపల్లి కాశన్న, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, జెట్టి ధర్మరాజు, ముచ్చర్ల దినకర్, కందికొండ మోహన్, వహీద్‌ఖాన్, గుడిపల్లి నిరంజన్, డాక్టర్ దశరథం, బొల్గం శ్రీను, ప్రతాప్ కాటిక్యి, కల్వకోల్ మద్దిలేటి, నాగవరం బాల్‌రాం, ఖాజా పాల్గొన్నారు.

ఎదిరేపల్లి మశమ్మ స్మారకోత్సవంలో మాట్లాడుతున్న కవి యాకుబ్

అసంపూర్తిగా పంచాయతీ భవన నిర్మాణం

అసంపూర్తిగా ఉన్న మమ్మాయిపల్లి గ్రామ పంచాయతీ భవనం

బిజినేపల్లి, డిసెంబర్ 15: మండలంలోని మమ్మాయిపల్లిలో పంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ భవనాలు అసంపూర్తిగా దర్శనమిచ్చాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ భవనాలను మంజూరు చేయగా నేటివరకు కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భవనాల పనులు పూర్తి చేయలేదు. దీంతో అసంపూర్తిగా పనులు జరిగి సదరు భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ భవనానికి ఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద రూ.20 లక్షలు మంజూరుకాగా భవనానికి చెత్తు వరకు పనులుచేసి వదిలేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నేటికీ డబ్బులు అందకపోవడంతో పనులు నిలిపివేయడం జరిగిందని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఎస్సీ కమ్యూనిటీ భవనం కూడా స్లాబ్‌వేసి మిగతాపనులు నిర్వహించలేదు. ఇలా మండలంలో ప్రతిగ్రామంలోనూ అభివృద్ధి పనులు సక్రమంగా జరగకపోగా కుంటుపడుతున్నాయి. అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ భవనం